క్లుప్తంగా

యువత బాధ్యతనెరిగి నడుచుకోవాలి



బంటుమిల్లి: ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత సమాజం కోసం బాధ్యతనెరిగి నడుచుకోవాలని మండల న్యాయ సేవాధికార కమిటీ, బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ యువత తల్లిదండ్రుల శ్రమను, ఆశలను దృష్టిలో ఉంచుకుని వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాలకు బానిసలు కావడం తదితర విషయాల వల్ల సంభవించే ప్రమాదాలపై అవగాహన కలిగించారు. పలువురు న్యాయవాదులు పలు చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్(శ్యాంబాబు), పీవీ వెంకటేశ్వరరావు, కె.రాంబాబు, ఈవీఎస్ రాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు



బంటుమిల్లి: ప్రభుత్వం చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, నేషనల్ గ్రీన్‌కార్ ఆదేశాల మేరకు స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో అమ్మ పేరు అనే కార్యక్రమం ద్వారా మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు సాబూజాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాదాల వితరణ

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవి క్షేత్రంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాకంబరీ అలంకారం సందర్భాన్ని పురస్కరించుకుని అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం శ్రీవాసవి ప్రార్థన మందిరంలో శ్రీవాసవిమాతకు అన్న ప్రసాదాల నైవేద్యాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పెడన పట్టణ, మండల ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీవాసవి మాత అన్న ప్రసాదాలను స్వీకరించారు. జై వాసవి.. జై జై వాసవి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్న పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, నరసింహారావు, శ్రీనివాస్ గుప్తా, పూర్ణ ప్రదీప్‌గుప్తా, రాజా, రమేష్, నాగు, రాధాకృష్ణ, సుధారాణి, లక్ష్మీ తాయారు, అపర్ణ, పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరినాట్లు



కృత్తివెన్ను: ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్ల ప్రక్రియ ప్రారంభమైంది. మండల పరిధిలోని యండపల్లి, చెరుకుమిల్లి, మునిపెడ తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లు చేపట్టారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 5 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమైనట్లు అధికారులు వివరించారు. చాలా గ్రామాల్లో రైతులు వెదజల్లే పద్ధతిలో ఇప్పటికే సాగు ప్రక్రియ పూర్తిచేయగా నాట్లు వేసే పద్ధతిలో ఇప్పుడు పనులు చేస్తున్నట్లు రైతులు వివరించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

కోనేరుసెంటర్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పీఎస్ఎస్ బాలాజీ తెలిపారు. బందరు మండలం పోతేపల్లిలోని మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు అసోసియేషన్ హాలులో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, జ్యూయలరీ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, జితేంద్ర, డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి శంకర్‌నాథ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతయ్య, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏ పని చేయొద్దు

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్



ఘంటసాల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

ఘంటసాల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ పని చేయొద్దని అధికారులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ వేమూరి రజనీ కుమారి అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా యండకుదురు, మల్లాయి చిట్టూరు, కొడాలి, శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, దేవరకోట, తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తాగునీరు, సాగునీరు, రోడ్లు, విద్యుత్, జగనన్న లే అవుట్లు, హౌసింగ్ తదితర అంశాలపై సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

జగనన్న లే అవుట్లపై విచారణ చేయిస్తా

నియోజకవర్గంలో జగనన్న లే అవుట్లు, కాలనీల నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని వాటిపై విచారణ చేయిస్తానన్నారు. ఒక దశలో ఏసీబీకి ఫిర్యాదు చేస్తానని కూడా ఎమ్మెల్యే అన్నారు. కొత్తగా విద్యుత్ పనులు చేస్తుండగా స్తంభాలు వేసేటప్పుడు పంచాయతీకి చెందిన పైపులైన్లు పగిలిపోతుండటంతో పంచాయతీ వారే సమస్య పరిష్కరించుకోవాలని విద్యుత్ అధికారులు చెబుతున్నారని అనగా, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఆ పనులను వారే చేసేలా చూడాలని అధికారులకు తెలిపారు. నియోజకవర్గంలో డాక్టర్ శ్రీహరి హత్యపై సీఐడీ ఎంక్వయిరీ వేయించానని, తర్వాత హౌసింగ్ పై ఎంక్వయిరీ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో అక్రమ ఇసుక, బుసక, మట్టి తవ్వకాలు చేపట్టవద్దని, అక్రమాలు జరిగితే గ్రామ స్థాయిలోని ఈవో, వీఆర్వోలతో పాటు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తానన్నారు.

యండకుదురు గ్రామాన్ని దత్తత తీసుకుంటా

ఘంటసాల మండలం యండకుదురు దత్తత గ్రామంగా స్వీకరించి ఓ మోడల్ గ్రామంగా తయారు చేస్తానని బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఘంటసాలను పర్యాటక కేంద్రంగా తీర్చిద్దేందుకు ప్రయత్నం చేస్తానని, అసంపూర్తిగా మిగిలిన శయన బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్ఆర్ఈజీఎస్, సీసీఆర్‌సీ నిధులతో మండలంలోని గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ముందుగా బుద్ధప్రసాద్‌ను జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, ఎంపీపీ వేమూరి రజనీ కుమారి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ, తహసీల్దార్ ఎన్‌బీ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పించిన పార్టీ నాయకులు



అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

అవనిగడ్డ: సాధారణ కుటుంబం నుంచి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశం ప్రపంచ దేశాలతో పోటీపడేలా విజన్ 2020తో కలాం పనిచేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, రైతు విభాగం నాయకులు సామర్ల రామచంద్రరావు, పార్టీ నాయకులు చింతలపూడి బాలు, గరికపాటి కృష్ణారావు, గోళ్ళ నాగేశ్వరరావుతో పాటు పలువురు పారీ నాయకులు పాల్గొన్నారు.

గాంధీక్షేత్రంలో...

గాంధీక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, జనసేన నాయకులు ఘంటసాల కన్నయ్య, గుడివాక శివరామ్, బడే రాఘవ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విశ్వనాథపల్లి పాఠశాలలో న్యూట్రిగార్డెన్ ఏర్పాటు



న్యూట్రిగార్డెన్‌ను ప్రారంభించి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో గార్డెన్ ఏర్పాటుకు మట్టిని తోలించారు. వివిధ రకాల కూరగాయల సాగుకు అనుగుణంగా బోదులను ఏర్పాటు చేశారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి ఈ న్యూట్రి గార్డెన్‌ను ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారంతో ఎంపీపీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల కూరగాయల మొక్కలు నాటి, ఆకుకూరల విత్తనాలను చల్లారు. ఏ విధమైన రసాయన ఎరువులు లేకుండా వీటిని పెంచనున్నట్లు న్యూట్రి గార్డెన్ పర్యవేక్షకుడు అప్పికట్ల సాంబశివయ్య తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఎం రవివర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తాం

- పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్
- తరకటూరులో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ



రైతులకు పంట సాగు హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గూడూరు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని తరకటూరులో రైతులకు పంట సాగు హక్కు పత్రాల(సీసీఆర్సీ కార్డు) పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. మెగా డీఎస్సీ, సామాజిక పెన్షన్ల పెంపు, ఉచిత ఇసుక వంటి హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేశారన్నారు. ఎన్నికల హామీలలో మిగిలిన పథకాలను కూడా రానున్న రోజుల్లో తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించడానికి ప్రతిపక్ష పార్టీ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్.ఎస్.శాంతి, మండల వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, టీడీపీ నాయకులు పోతన లక్ష్మీ నరసింహ స్వామి, కాసగాని శ్రీనివాసరావు, సాయన సోమయ్య, గోపి నాగబాబు, కాట్రగడ్డ రత్నబాబు, కట్టా మునేశ్వరరావు, గళ్లా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు సమర్థంగా నిర్వహించాలి



చల్లపల్లి(అవనిగడ్డ): రైతులకు ముంపు సమస్య లేకుండా డ్రైనేజీ పనులను సమర్థంగా నిర్వహించాలని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపురం వద్ద గుండేరు డ్రైన్‌ని శనివారం బుద్ధప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండేరు మేజర్ డ్రైన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులు పూర్తయినట్టు చెప్పారు. డ్రైనేజీ పనుల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మోపిదేవి జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, డ్రైనేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈ కె.హరీష్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పెడన: పట్టణంలో శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ తెలిపారు. అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రశీదు, బ్యాంక్ ఖాతా పుస్తకాలను స్వామి వారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారి ప్రాశస్త్యం తెలిపే సమాచారం, భక్తుల సౌకర్యార్థం విరాళాలు, బ్యాంక్ వివరాలతో కూడిన ఖాతా నంబర్, సభ్యుల ఫోన్ నంబర్లను తెలిపే బ్యానర్‌ను ఆవిష్కరించి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో సింగరాజు ప్రకాశరావు, వీణం శ్రీనివాస్, జక్కుల చిన బసవేశ్వరరావు, కూనపరెడ్డి శ్రీనివాసరావు, యర్రపోతు నాగేశ్వరరావు, తమ్మ భీమయ్య, భూసం అగస్త్యయ్య, పైడిరాజు, నవీన్, గూడూరు అగస్త్యయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఆర్‌వో వాటర్ స్టీల్ ట్యాంకు వితరణ

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంకు శనివారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన భీమిరెడ్డి సుధీర్ రెడ్డి, రజిత దంపతులు 2 వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్‌వో వాటర్ స్టీల్ ట్యాంకు వితరణగా అందజేశారు.

శ్రీవల్లీదేవసేన అమ్మవార్లకు ఆషాఢ సారె



మోపిదేవిలో స్వామివార్లకు పట్టు పవిత్రములు సమర్పించుకుంటున్న ఆలయ ఏసీ చక్రధరరావు



వక్కపట్లవారిపాలెం రామాలయంలో సీతాదేవికి సారె సమర్పించిన మహిళలు

మోపిదేవి: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక శ్రీవల్లీదేవసేన అమ్మవార్లకు, గ్రామదేవత మునీశ్వరమ్మ తల్లికి శనివారం సాయంత్రం ఆషాఢ సారె సమర్పించుకున్నారు. మోపిదేవి ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి పలువురు మహిళలు సామూహికంగా పాదయాత్రగా ఆలయానికి చేరుకుని ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవార్లకు చీర పండ్లు, పూలు, చలివిడి, స్వీట్లు సారెగా అందజేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా స్థానిక శ్రీ వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో సాయంత్రం స్వామివార్లకు పట్టు పవిత్ర ఆరాధన, అధివాసములు, చతుర్వేద స్వస్తి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

శాకంబరీదేవికి సామూహిక కుంకుమ పూజలు

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత శ్రీ వీర్లంకమ్మ తల్లి దేవతను గత రెండు రోజులుగా శాకంబరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం అమ్మవారికి భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలంకారం ముగింపు సందర్భంగా అమ్మవారిని అలంకరించిన కూరగాయలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో సీతాదేవికి ఆషాఢ సారె

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామంలోని రామాలయంలో శనివారం ఆషాఢపు సారె వేడుక పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్, రాధ దంపతుల ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢ సారె కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామ దేవత అయిన నంగేగడ్డ గ్రామంలోని శ్రీవిరుగులమ్మ అమ్మవారికి తొలిపూజలు చేసి సంప్రదాయ సారె అందించారు. అనంతరం వక్కపట్లవారిపాలెం ప్రధాన వీధుల వెంట ఊరేగింపుగా సారె పళ్లాలతో మహిళలు రామాలయానికి చేరుకున్నారు. తొలుత సర్పంచ్ శ్యామ్ దంపతులు ఆషాఢ సారె బిందెలను సీతారాములకు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్త పూజ జరిపిన గ్రామ మహిళలు గాజులు, పసుపు కుంకుమ, చీర, రవిక, పండ్లు, మిఠాయిలతో సీతాదేవికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.

8 కి.మీ. పొడవునా పంట కాలువ పూడికతీత

ట్రస్ట్ అధినేత విక్కుర్తికి నాలుగు గ్రామాల రైతుల సన్మానం



దాత విక్కుర్తి శ్రీనివాసరావును సత్కరిస్తున్న రైతులు

పర్రచివర(నాగాయలంక): పంట కాలువలో 8 కి.మీ. మేర పూడిక ఏర్పడి సాగునీటి కోసం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి అవనిగడ్డకు చెందిన విక్కుర్తి రాఘవయ్య చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సౌజన్యంతో చేపట్టిన పనులు శనివారం పూర్తయ్యాయి. గత వారం ట్రస్ట్ చైర్మన్, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు రూ.2 లక్షలకు పైగా సొంత నిధులతో ఈ పనులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. పెదపాలెం నుంచి సొర్లగొంది వరకు దరిదాపు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా పంట కాలువకు అటూ ఇటూ రెండు గజాల మేర ఆయా గ్రామాల రైతులు స్వయం పర్యవేక్షణలో పూడిక తీశారు. పూడికతీతతో సాగునీటికి ఆటంకాలు తొలగాయి. దీంతో సొర్లగొంది, దిండి, దీనదయాళపురం, పర్రచివర గ్రామాల రైతులు విక్కుర్తి శ్రీనివాసరావును శనివారం సాయంత్రం సొర్లగొందిలో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత పంట కాలువ సాగునీటికి మహిళలతో కలసి శ్రీనివాసరావు పూజలు చేసారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ వెంకట నారాయణ, నాయుడు రామారావు, తమ్ము అర్జునరావు, వనమాల రామారావు, కోలా భిక్షం, కారంకి కృష్ణ, బెల్లంకొండ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గూడూరు సమస్యలపై జెడ్పీలో గళం

గూడూరు: మండలంలోని ప్రధాన సమస్యలను శనివారం మచిలీపట్నంలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించినట్లు గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు తెలిపారు. ప్రధానంగా తరకటూరు సీపీడబ్ల్యూ స్కీము నుంచి మండల కేంద్రమైన గూడూరుకు రక్షిత తాగునీటి సరఫరా చేయాలని కోరినట్లు వెల్లడించారు. గత ఏడాది భారీ వర్షాలకు కూలిన కత్తులవానిపాలెం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. తుమ్మలపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన హెల్త్ సెంటర్ పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించమని కోరినట్లు తెలిపారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు నేడు లో భాగంగా చేపట్టిన ఆర్‌ఓ ప్లాంటుకు పైప్‌లైన్ అనుసంధానం చేయకపోవడంతో నిరుపయోగంగా మారిన విషయాన్ని తెలియజేశానన్నారు. జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ గూడూరు సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు సురేష్ రంగబాబు తెలిపారు. తరకటూరు స్కీమ్ నుంచి గూడూరుకు తాగునీటి సరఫరా సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని, కత్తులపాలెం వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారన్నారు.

ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌కు సన్మానం



బుద్ధ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీటీసీలు

ఘంటసాల: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా ఘంటసాల మండల పరిషత్ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను టీడీపీ, జనసేన ప్రజా ప్రతినిధులు, నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న) ఆధ్వర్యంలో యండకుదురు ఎంపీటీసీ కుమార్ రాజాలతో పాటు ఇతర ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించి మొక్కలను అందించారు. వివిధ శాఖల అధికారులు కూడా ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం బయట టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను సన్మానించారు.

షాపింగ్‌మాల్ వద్ద ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

మచిలీపట్నంటౌన్: నగరంలోని విజయవాడ బైపాస్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన షాపింగ్‌మాల్ యాజమాన్యం వారు రోడ్డు మార్జిన్ ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను శనివారం తొలగించే పనులు ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీ బుధవారం 'సాక్షి'లో 'పేదలపై ఉక్కుపాదం.. పెద్దలపై ఉదాసీనత' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు రోడ్డు మార్జిన్ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏసీపీ మల్లికార్జునరావును ఆదేశించారు. దీంతో ఆయన షాపింగ్ మాల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి రోడ్డు మార్జిన్ ఆక్రమిస్తూ నిర్మించిన ఫుట్‌పాత్ రాళ్లు, దిమ్మలను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆ నిర్మాణాలను తొలగించే పనులు చేపట్టారు.

ఉద్యోగుల సమస్యలపై ఆరా



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలోని పలు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య తెలుసుకున్నారు. ఆయన శనివారం మచిలీపట్నంలోని సోషల్ వెల్ఫేర్, ఆర్అండ్‌బీ, డీఎంఅండ్‌హెచ్‌వో, స్త్రీ, శిశు సంక్షేమశాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రోస్టర్లపై జిల్లా కలెక్టర్‌తో సమీక్షించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల రిక్రూట్‌మెంట్, ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ రోస్టర్లలో విషయాలపై ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మద్దాల కృష్ణకుమార్, కోశాధికారి జయప్రకాష్, మాజీ అధ్యక్షుడు నాదెళ్ల అరవింద్‌కుమార్, సలహాదారు వేము కోటేశ్వరరావు, తిరుపతి జిల్లాశాఖ అధ్యక్షుడు పల్లిపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాల గజిట్ నిబంధనలను అమలు చేస్తాం



అద్దెదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరామయ్య

పెడన: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల గజిట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసి దుకాణదారులకు న్యాయం చేస్తామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య తెలిపారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని అద్దెదారులతో శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అద్దెదారులు మాట్లాడుతూ గజిట్ నిబంధనలకు విరుద్ధంగా కొందరు దుకాణదారులు తమ దుకాణాలకు ఎదురుగా హోటల్స్, అక్రమంగా షాపులు పరిధి దాటి నిర్మాణాలు చేయడం వలన అద్దెదారుల వ్యాపారాలకు నష్టం జరుగుతోందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. లీజుదారులకు, వినియోగదారులకు టాయిలెట్లు, కనీస వసతులు కూడా లేవని తెలిపారు. వర్షం వస్తే మురికి నీరు దుకాణాల ముందు నిలిచిపోతున్నాయని, దీంతో వినియోగదారులు షాపులకు రావడం లేదన్నారు. సమావేశంలో వాహెబ్‌ఖాన్, వెంకటేశ్వరరావు, నాగరాజు, జనార్దన్‌రావు, శివనాగరాజు, రామకృష్ణ మున్సిపల్ ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

మోపిదేవి: లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, అందుకు చట్టపరంగా జరిమానా ఉంటుందని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని పెదప్రోలు శివారు కాసానగర్ వద్ద ప్రధాన జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్ బాలురకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, లైసెన్సు లేనిదే వాహనాలు నడపరాదని హెచ్చరించారు. అనంతరం ద్విచక్ర వాహనాల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సు, సీ బుక్, ఇన్సూరెన్స్ పత్రాలు పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న చలానాలు కట్టించారు.